గాలికుంటు నివారణకు టీకా.. పశువుల ఆరోగ్యానికి భరోసా

- ఉచితంగా టీకాలు అందిస్తున్న ప్రభుత్వం
- పశువైద్యాధికారుల పర్యవేక్షణలో వైద్య శిబిరాలు
- పాడి రైతుల ఆర్థిక ప్రగతికి పథకాలు దోహదం



నాయుడుగూడెంలో పశువులకు గాలికుంటు వ్యాధి టీకా వేస్తున్న పశువైద్యాధికారులు

పెదపాడు : రైతుల ఆర్థిక ప్రగతికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక పథకాలు దోహదపడుతున్నాయి. వ్యవసాయంపై ఆధారపడే అన్నదాతలకు పాడి పశువుల ద్వారా అదనపు ఆదాయం సమకూరుతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పశువులకు వచ్చే వ్యాధుల నివారణ– చికిత్స అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టి రైతులకు అండగా ఉంటోంది. దీనిలో భాగంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది. దెందులూరు నియోజకవర్గంలో 8,421ఆవులు, 73,619 గేదెలు, 62,345 గొర్రెలు, 16, 736 మేకలకు ఈ టీకాలను ఉచితంగా అందించనున్నారు. ఏప్రిల్ 24వ తేదీ వరకూ ప్రభుత్వ పశువైద్య సిబ్బంది పాడి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తారు. 4నెలలు దాటిన ప్రతి పశువుకు ఈ టీకాలు అందించాల్సిన అవసరముంది. వైద్యులు ప్రత్యేకంగా ప్రతి గ్రామంలో శిబిరాలు నిర్వహించి గాలికుంటు వ్యాధి లక్షణాలు, ఈ వ్యాధి సోకడం వల్ల కలిగే నష్టాలను రైతులకు వివరిస్తున్నారు.

గాలికుంటు వ్యాధి లక్షణాలు

గాలికుంటు వ్యాధి సోకిన పశువుల్లో తీవ్రమైన జ్వరం, నీరసించిపోవడం, కొద్దిపాటి ఎండకు కూడా రొప్పడం, చూడి పశువులు ఈసుకుపోవడం, ఎద్దులలో పని సామర్థ్యం తగ్గడం వంటి లక్షణాలు ఉంటాయని వైద్యులు తెలిపారు. ఈ వ్యాధి సోకిన పశువుల్లో పాల ఉత్పత్తి, పని సామర్థ్యం తగ్గుతుందన్నారు. గణనీయంగా పాల ఉత్పత్తి తగ్గిపోవడంతో రైతు ఆర్థికంగా నష్టం జరిగే అవకాశముందని వైద్యులు అంటున్నారు. పాలు తాగే దూడల్లో మరణాలతోపాటు చికిత్స అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే పశువులు చనిపోతాయని, అందువల్ల రైతులు తమ పశువులకు తప్పకుండా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు ఇవ్వాల్సిన అవసరముందన్నారు.

టీకాల వల్ల లాభాలు

వ్యాధి సోకిన పాడి పశువుల్లో తగ్గే పాల ఉత్పత్తిని శాశ్వతంగా నివారించవచ్చు. వ్యాధి సోకిన మగ పశువుల్లో పని సామర్థ్యాన్ని పూర్తిగా నివారించవచ్చు దూడల్లో మరణాలు తగ్గించి ఆరోగ్యంగా ఎదగటానికి ఉపయోగపడుతుంది. పశువుల గుర్తింపునకు చెవిపోగు వేయడం ద్వారా రైతులు ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూరుతుంది.

టీకాలు అందించే పశువుల వివరాలు

మండలం	ఆవులు	గేదెలు	గొర్రెలు	మేకలు
పెదపాడు	2,423	16,912	6,981	2,601
ఏలూరు	1,777	13,531	3,069	2,625
దెందులూరు	1,950	18,951	22,846	3,618
పెదవేగి	6,471	54,668	39,499	13,118
మొత్తం	12,621	1,04,062	72,395	21,962

రైతులు సహకరించాలి



రైతులు తమ పాడి పశువులకు తప్పని సరిగా ఏటా గాలికుంటు వ్యాధి టీకాలు అందించాల్సిన అవసరముంది. ఈ నెల 25 నుంచి ఏప్రిల్ 24వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో గాలికుంటు వ్యాధి టీకాలు అందిస్తున్నాం. సమీపంలోని రైతు భరోసా కేంద్రంలో వివరాలు తెలుసుకుని గాలికుంటు వ్యాధి నివారణకు రైతులు సహకరించాలి

– డాక్టరు సీహెచ్ వాణీ, సంధ్య పశువైద్యాధికారి, పెదపాడు

టీకాలతో అధిక ప్రయోజనం



పశువులకు ఏటా ప్రభుత్వం గాలికుంటు వ్యాధికి ఉచితంగా టీకాలు అందిస్తోంది. దీనివల్ల పశువులు ఆరోగ్యంగా ఉంటున్నాయి. పాడి పశువులకు టీకా వేయడం వల్ల పాల దిగుబడి తగ్గకుండా ఆదాయం నిలకడగా ఉంటుంది. సకాలంలో పశువులకు గాలి కుంటు టీకాలు అధికారులు ఇవ్వడం వల్ల రైతులకు ఆర్థికంగా లబ్ధి చేకూరుతోంది.

– ఆవల మోహనరావు, పాడి రైతు, పెదపాడు

ఆసరా సభలను విజయవంతం చేయండి



ఉంగుటూరు సమావేశ మందిరంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రేమాన్విత

ఉంగుటూరు: ఆసరా సభలను విజయవంతం చేయాల్సిన బాధ్యత వైకేపీ సిబ్బంది , డ్వాక్రా మహిళలపై ఉందని ఉంగుటూరు ఎంపీడీవో ప్రేమాన్విత అన్నారు. సోమవారం ఉంగుటూరులో డ్వాక్రా సీసీలు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈనెల 29 నుంచి నాలుగుచోట్ల సభలలో ఎమ్మెల్యే వాసుబాబు చేతుల మీదుగా ఆసరా నిధులు విడుదల చేసినట్టు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు పుప్పాల చిన్నబాబు మాట్లాడుతూ వృద్ధులను, అనారోగ్యంతో ఉన్న మహిళలను ఇబ్బంది పెట్టవద్దన్నారు. ఆసరా అములులో డ్వాక్రా సీసీ, వలంటీర్లు విమర్శలకు తావు లేకుండా పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. పార్టీ మండల కన్వీనర్ మరడ మంగరావు మాట్లాడుతూ ఆసరా నిధులు మహిళల ఆర్థిక స్వావలంబనకు దోహదపడుతుందన్నారు. వైకేపీ ఏపీవో పద్మావతి మాట్లాడుతూ మండలంలో నాలుగు సభలు విజయవంతం కావడానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీపీ గంట శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు యెలిశెట్టి పాపారావు బాబ్జి, సచివాలయాల కన్వీనర్ పెనుగొండ బాలకృష్ణ, కొరిపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి దాతల సహకారం



రామాలయంలో సమావేశమైన అభివృద్ధి కమిటీ సభ్యులు

నిడమర్రు: ఆలయాల అభివృద్ధికి దాతల సహకారం తీసుకోవాలని, నిత్య ధూపదీప నైవేద్యాలకు లోటు లేకుండా ఆదాయ వనరులు సమకూర్చాలని నిడమర్రు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ సంకు సత్య కుమార్ అన్నారు. సోమవారం నిడమర్రు మండలం బువ్వనపల్లిలోని రామాలయం అభివృద్ధి కమిటీ తొలి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిథిలావస్థకు చేరిన రామాలయాన్ని దాతల సహకారంతో సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దడం అభినందనీయమన్నారు. రామాలయం అభివృద్ధి కమిటీ నూతన అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి కృష్ణమోహన్ మాట్లాడుతూ ఇటీవల ఆలయ ధ్వజస్తంభం విరిగి పడిపోవడంతో గ్రామానికి చెందిన దాత ముప్పాణ్ణేని మోహన రావు, గ్రామస్తుల విరాళాలతో నూతన ధ్వజస్తంభం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ధ్వజ స్థంభానికి ఇత్తడి తొడుగును దాతల సహకారంతో ఏర్పాటు చేశామన్నారు. శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించాలని నూతన కమిటీ సభ్యులు నిర్ణయించారు. ఈకార్యక్రమంలో ఆలయ గౌరవాధ్యక్షురాలు ముప్పాణ్ణేని సరోజని, గ్రామ ఉపసర్పంచ్ వెల్లంకి నరేష్, గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కాన్వెంట్ శ్రీను, అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చెరువులో అక్రమంగా రోడ్డు నిర్మాణం



గాలాయగూడెంలో చెరువులో రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఇరిగేషన్ డీఈ అర్జున్

దెందులూరు: నిబంధనలకు విరుద్ధంగా చెరువుల్లో రోడ్డు వేయడం తీవ్ర అభ్యంతరకరమని అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డివిజనల్ ఇంజనీర్ అర్జున్ అన్నారు. సోమవారం గాలాయగూడెంలో విద్యుత్ సబ్‌స్టేషన్ పక్కన ఉన్న చెరువులో ఆదివారం రాత్రి జే సీబీతో నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు నిర్మించారు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు సిబ్బందిని పంపించే సరికి జేసీబీతో పారిపోయారన్నారు. జేసీబీని గుర్తించామని అక్రమంగా వేసిన రోడ్డును తొలగిస్తే హెచ్చరించి వదిలేస్తామని, లేకుంటే జేసీబీని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేస్తామన్నారు. చెరువులో రాత్రికి రాత్రే అక్రమంగా నిర్మించిన రోడ్డు అంశాన్ని కలెక్టర్, అధికారులకు తెలియచేస్తామన్నారు.

ఆలయ రోడ్డు నిర్మాణానికి రూ.25 లక్షల విరాళం



రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న గంటా కోటేశ్వరరావు, అచ్చమ్మ దంపతులు

దెందులూరు: గాలాయగూడెంలోని అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఆలయానికి జంగారెడ్డిగూడెం రోడ్డు నుంచి ఆలయం వెనుకకు బీటీ రోడ్డు నిర్మాణానికి మణికంఠ కన్‌స్ట్రక్షన్స్ అధినేత, దాత గంటా కోటేశ్వరరావు, అచ్చమ్మ దంపతులు సోమవారం రూ. 25 లక్షలు ఆలయ కమిటీకి అందజేశారు. అనంతరం బీటీ రోడ్డు నిర్మాణం పనులను దాత దంపతులు కోటేశ్వరరావు, అచ్చమ్మ భూమి పూజ చేసి ప్రారంభించారు. దాత ఔదార్యాన్ని అచ్చమ్మ తల్లి ఆలయ కమిటీ, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పూజారి శ్రీనివాసరావు, గంటా సుబ్బారావు, పూజారి నాగరాజు, అంబటి లక్ష్మణరావు, తుంగా రాము, పెద్దిశెట్టి నాని, బసవయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్రప్రదేశ్ సాధనకు కృషి చేయాలి



భీమడోలులో నిర్వహించిన శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎంపీడీవో జీఎల్ఎస్‌వీ రాఘవన్

భీమడోలు: స్వచ్ఛత ప్రతి ఇంటి నుంచి ఆరంభమయ్యేలా క్షేత్రస్థాయి ఉద్యోగులు పని చేస్తే స్వచ్ఛాంధ్రప్రదేశ్ సాధన సుసాధ్యమవుతుందని భీమడోలు ఎంపీడీవో జీఎల్ఎస్‌వీ రాఘవన్ అన్నారు. భీమడోలులోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద సోమవారం జిల్లా పరిధిలోని భీమడోలు, దెందులూరు, ఏలూరు, కైకలూరు మండలాల్లోని ఎంపిక చేసిన పంచాయతీలకు చెందిన సర్పంచులు, ఉపసర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ, ఇంజనీరింగ్ సహాయలకు ఒక రోజు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులకు జిల్లా చైతన్య యువజన సంఘం అధ్యక్షుడు పాము మాన్‌సింగ్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీవో జీఎల్ఎస్‌వీ రాఘవన్ మాట్లాడుతూ బహిరంగ మలసర్జన వంటి సాంఘిక దురాచారాన్ని రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రతి ఇంటా మరుగుదొడ్లు వినియోగంలో ఉన్నాయన్నారు. ప్రస్తుతం పర్యావరణానికి విఘాతం కల్గించే ఘన, ద్రవ, ప్లాస్టిక్ వంటి వ్యర్థాలను నిర్మూలనకు ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రజల్లో అవగాహన కల్పిస్తోందన్నారు. సచివాలయ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. ఇళ్లు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల నుంచి వచ్చే చెత్తను, ప్లాస్టిక్ వ్యర్థాలను ఎప్పటికప్పుడు సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. వాటి నుంచి పంచాయతీ ఆర్థిక స్వావలంబన సాధించాలన్నారు. గ్రామాలు స్వచ్ఛతకు నిలయాలు కావాలన్నారు. తద్వారా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి అవార్డులను పొందేలా పోటీ పడాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నీలం శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శులు ఎస్.ఠాగూర్, వెంకట్రావు, చెట్టున్నపాడు, దుద్దేపూడి, పెరుగ్గూడెం, సోమవరప్పాడు, కొక్కిరాయలంక, మాల్కాపురం, భూజబలపట్నం పంచాయతీలకు సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



గోపన్నపాలెంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరిని సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

దెందులూరు: గోపన్నపాలెంలోని ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు కొండేటి గంగాధరబాబు, మాగంటి కృష్ణమోహన్, తోట పద్మారావు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సూర్యనారాయణ మాస్టారుకు ఎమ్మెల్యే పరామర్శ

పెదపాడు: రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ డైరక్టరు ముదుగురు సూర్యనారాయణను ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పరామర్శించారు. ఇటీవల సూర్యనారాయణ తండ్రి రాములు మృతి చెందడంతో సోమవారం ఆయన్ను ఎమ్మెల్యే కొఠారు పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో పెదపాడు మండల కన్వీనర్ అప్పన ప్రసాద్, జెడ్పీటీసీ ఘంటా పద్మశ్రీప్రసాదరావు, ఎంపీపీ బత్తుల రత్నకుమారి ఏసురాజు, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి జానం పేట బాబు, నర్సాపురం పార్లమెంట్ పరిశీలకుడు ఘంటా ప్రసాదరావు, ఎంపీటీసీ గొరిపర్తి రంగారావు, నాయకులు అక్కినేని లక్ష్మణరావు పాల్గొన్నారు.

బాధితుడికి ఎమ్మెల్యే పరామర్శ



ఏలూరు ఆస్పత్రిలో వైసీపీ కార్యకర్త నాగరాజును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: దెందులూరు బహిరంగ సభలో గాయపడిన పెదవేగి మండలం అమ్మపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మరీదు నాగరాజును సోమవారం ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి పరామర్శించారు. ఆర్థిక సాయం చేశారు. వైద్యుల వద్దకు వెళ్లి నాగరాజుకు మెరుగైన వైద్యసేవలందించాలని సూచించారు. ఆయన వెంట దెందులూరు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, పెదవేగి ఎంపీపీ తాతా రమ్య,పెదవేగి మాజీ ఏఎంసీ చైర్మన్ మేకా లక్ష్మణరావు ఉన్నారు.

ఉపాధి వేతనం రూ.15 పెంపు

ఉంగుటూరు: ఉపాధి కూలీలకు రోజువారి వేతనం రూ.15 కేంద్ర ప్రభుత్వం పెంచిందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శరణాల మాలతీ రాణి వెల్లడించారు. సోమవారం ఉంగుటూరు మండలం నారాయణపురంలో అమలవుతున్న ఉపాధి పనులును ఆమె పరిశీలించారు. శ్రమ శక్తిగ్రూపు సభ్యులకు స్వీట్లు పంచారు. ఆమె వెంట బీజేపీ మహిళామోర్చా జిల్లా అధ్యక్షురాలు అడపా శోభారాణి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు నిడమర్రులో విద్యుత్ సరఫరా నిలుపుదల

నిడమర్రు: నిడమర్రుతో పాటు పెదనింద్రకొలను విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ట్రాన్స్‌కో డీఈ వెంకటేశ్వరరావు తెలిపారు. సబ్ స్టేషన్, విద్యుత్ సరఫరా లైన్లు మరమ్మతుల నిమిత్తం సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు తెలిపారు.

ముగ్గురు జూదరుల అరెస్టు

పెదపాడు: పేకాట స్థావరంపై దాడిచేసి ముగ్గురు జూదరులను అరెస్టు చేసినట్లు పెదపాడు పోలీసులు తెలిపారు. మండలంలోని రాజుపేట గ్రామ శివారు ప్రాంతంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో ఎస్సై నాగబాబు తన సిబ్బందితో కలిసి దాడి చేసి వారి వద్ద నుంచి రూ.1450 స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసినట్టు పెదపాడు ఎస్సై సోమవారం తెలిపారు.

సీతారామస్వామి ఆలయంలో నేడు ఉత్సవాలు ప్రారంభం



గుండుగొలనులోని సీతారామస్వామి

భీమడోలు: గుండుగొలనులోని పురాతన సీతారామస్వామి ఆలయంలో ఈనెల 28 నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు శ్రీరామనవమి ఉత్సవాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసారు. దేవదాయ ధర్మదాయ శాఖ పరిధిలోని ఈ దేవాలయాన్ని ఆలయ ఫౌండర్ ట్రస్టీ కొండ గంగారాజ్‌కుమార్ అభివృద్ధి చేసారు. భద్రాది తరహాలో ఏటా ఇక్కడ శ్రీరామనవమి వేడుకలు నిర్వహిస్తారు.ఈనెల 28న స్వామి వారిని పెళ్లి కుమారునిగా అలంకరిస్తామని అర్చకులు తెలిపారు. 30న కల్యాణ మహోత్సవం, రాత్రి గరుడోత్సవం, 31న వసంతోత్సవం, పూర్ణాహుతి, రాత్రి ధ్వజావరోహణ, ఏప్రిల్2న ద్వాదశి కోవెల ప్రదక్షిణలు, దర్బార్, శ్రీపుష్పయాగం, పవళింపు సేవ, 3, 4వ తేదీల్లో శ్రీస్వామివారికి పవళింపు సేవతో ఉత్సవాలను ముగిస్తాయన్నారు. ఈనెల 5న గోపూజ, అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహిస్తామని ట్రస్టీ కొండ గంగరాజ్‌కుమార్ సోమవారం తెలిపారు.

బాడీ బిల్డింగ్ పోటీల్లో జిల్లాస్థాయిలో ప్రథమం



ఏలూరులో బాడీ బిల్డింగ్ పోటీల్లో ప్రథమ బహుమతిని అందుకుంటున్న నాగూర్‌బాబు

భీమడోలు: ఏలూరులోని సురేష్ బహుగుణ పోలీస్ స్కూల్లో ఆదివారం రాత్రి నిర్వహించిన జిల్లాస్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో మండలంలోని పాతూరు గ్రామానికి చెందిన బాడీ బిల్డర్ ఎస్‌కే నాగూర్‌బాబు సత్తా చాటాడు. 55 కేజీల విభాగంలో ప్రథమ స్థానం సాధించి బహుమతిని సొంతం చేసుకున్నాడు. కప్‌తో పాటు ప్రశంసపత్రాలను అందించారు. భీమడోలులోని జానకి ట్రావెల్స్ డ్రైవర్‌గా పని చేస్తున్న సూరప్పగూడెం పంచాయతీ శివారు పాతూరుకు చెందిన ఎస్‌కే నాగూర్‌బాబుకు బాడీ బిల్డింగ్‌పై చిన్నతనం నుంచి మక్కువ. అతనిలోని ప్రతిభను గుర్తించిన ట్రావెల్స్ యాజమానులు ప్రసాద్, కన్నాలు ప్రోత్సహించి భీమడోలులోని శ్రీదుర్గా మజిల్ పవర్ జిమ్ ట్రైనర్ శ్రీనివాసరరావు వద్దకు పంపారు. అతని శిక్షణలో నాగూర్‌బాబు జిల్లాస్థాయిలో ప్రథమ స్థానాన్ని సొంతం చేసుకున్నారు. నాగూర్‌బాబును పలువురు సోమవారం అభినందించారు. ట్రైనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇదే జిమ్ నుంచి మరో ఇద్దరు 60 కేజీలు, 65 కేజీల విభాగంలో జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానాలను సాధించారని పేర్కొన్నారు. 60 కేజీల విభాగంలో మహేష్, 65 కేజీల విభాగంలో ఎస్‌కే శుకూర్ విజయం సాధించారని ఆయన తెలిపారు.

సంప్రదాయాలను పరిరక్షించాలి



కవి రచయిత సత్యనారాయణను సన్మానిస్తున్న వర్తక సంఘం సభ్యులు

గణపవరం: మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించేందుకు కృషి చేస్తున్న కవులు, కళాకారులు, రచయితలను గౌరవించాలని పలువురు వక్తలు అన్నారు. గణపవరం కన్యకాపరమేశ్వరి వర్తక సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఉగాది పురస్కారాలు, కవి సమ్మేళనం నిర్వహించారు. ఏటా ఉగాది సందర్భంగా వర్తక సంఘం తరపున పురస్కారాలను అందించడం అభినందనీయమని వక్తలు అన్నారు. కాళ్లకూరి సుబ్బారావు స్మారక పురస్కారాన్ని భీమవరానికి చెందిన కళాకారుడు కంతేరు సత్యనారాయణకు, ఆధునిక కథానిక డే–2023లో భాగంగా కథానిక జీవి డా. వేదగిరి రాంబాబు స్మారక పురస్కారం పాలకొల్లు మండలం కొంతేరుకు చెందిన కథా నాటక రచయిత గంటా కల్యాణ్‌నాయుడుకు అందజేశారు. ఈ సందర్భంగా వారిని దుశ్శాలువాలతో సత్కరించి, నగదు పురస్కారం అందజేశారు. వర్తక సంఘ భవనం, పద్మినిపుర కళాపీఠం సంయుక్త ఆధ్వర్యంలో ఈకార్యక్రమం నిర్వహించారు. కవి రచయిత తెన్నేటి లక్ష్మీనర్సింహమూర్తి, పద్మినిపుర కళాపీఠం వ్యవస్థాపకుడు ఆర్‌వీఎస్ రాజు, అన్నపూర్ణ దంపతులు, వర్తక సంఘం ఉపాధ్యక్షుడు వంకాయల రామారావు, కార్యదర్శి నడింపల్లి రాంపండు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చలో ఢిల్లీపై ప్రచార జాతా



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్

భీమడోలు: కార్మికుల పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మోదీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్. లింగరాజు అన్నారు. సీఐటీయూ రైతు సంఘం , కౌలు సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం కోరుతూ సోమవారం మండలంలో ప్రచార జాతా నిర్వహించారు. కౌలు రైతు సంఘం కార్యదర్శి కె.శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.జీవరత్నం, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు కె.వి జయలక్ష్మి, కౌలు రైతు సంఘం జిల్లా కోకన్వీనర్ వెజ్జు శ్రీరామచంద్రమూర్తి, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం మండల కన్వీనర్ టి.సుమన్‌బాబు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ ఆసరా వారోత్సవం

గణపవరం: ఈనెల 28వతేదీ మంగళవారం గణపవరం మండలంలోని గణపవరం, సరిపల్లి, కొత్తపల్లి, వరదరాజపురం, వెలగపల్లి, జల్లికొమ్మర, అర్ధవరం, వల్లూరు, వాకపల్లికి చెందిన స్వయం సహాయక సంఘాలకు మూడో విడత వైఎస్సార్ ఆసరా పథకంలో నగదు జమ చేయనున్నట్టు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ దండురాము తెలిపారు. కేవీపీ పంక్షన్ హాలులో ఉదయం 9 గంటలకు ఈకార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు.

నిడమర్రులో..

నిడమర్రు: పెదనింద్రకొలను మహాత్మాగాంధీ భవనం వద్ద ఉన్న వంగా రవీంద్ర కన్వెన్షన్ హాల్‌లో బుధవారం ఉదయం 9 గంటలకు వైఎస్సార్ ఆసరా 3వ విడత నగదును లబ్ధిదారులకు అందజేస్తామని వెలుగు ప్రాజెక్ట్ ఏపీఎం జి. రాజశ్రీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొంటారని తెలిపారు. తోకలపల్లి, బైనేపల్లి, ఆముదాలపల్లి, చిననింద్రకొలను, దేవగోపవరం, పెదనింద్రకొలను, నిడమర్రు, మందలపర్రు, గుణపర్రు గ్రామాలకు సంబంధించిన 503 గ్రూపులకు సంబంధించిన 4,968 మంది సభ్యులకు రూ. 4.25 కోట్లు నగదు నేరుగా వారి అకౌంట్లలో జమ చేస్తారన్నారు.

డ్రోన్‌తో రీ సర్వే

దెందులూరు: ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం సోమవరప్పాడులో డ్రోన్‌తో భూముల రీ సర్వే ప్రారంభించారు. తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య, వైస్ ఎంపీపీ వేమూరి జితేంద్ర, సర్పంచ్ సరిగే నాగరాజు, సోమవరప్పాడు సర్వేయర్ ఫణి సమక్షంలో సాయంత్రం వరకు డ్రోన్‌తో భూములను చిత్రీకరించారు.

ఎమ్మెల్సీ రవీంద్రను కలిసిన నాయకులు



ఎమ్మెల్సీ రవీంద్రకు శుభాకాంక్షలు తెలుపుతున్న జెడ్పీటీసీ కోడే కాశి

నిడమర్రు: స్థానిక సంస్థల కోటాలో వైఎస్సార్ సీపీ తరపున ఎమ్మెల్సీగా పోటీచేసి ఘన విజయం సాధించిన వంకా రవీంద్రను మంగళవారం నిడమర్రు జెడ్పీటీసీ కోడే కాశి రవీంద్ర నివాసంలో మర్యాదపూరకంగా కలిసి పుష్పగుచ్ఛంతో శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ వచ్చే 2024 ఎన్నికల్లో వైసీపీ తిరిగి అధికారం దక్కేలా పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులందరూ కృషి చెయ్యాలన్నారు. చ్రేబోలు సొసైటీ అధ్యక్షుడు ఎలిశెట్టి పాపారావు బాబ్జి ఉన్నారు.

వృద్ధులకు కంటి పరీక్షలు

గణపవరం: కంటి సమస్యలపై నిర్లక్ష్యం తగదని, ప్రభుత్వం కంటికి సంబంధించి పరీక్షలు చేసి ఉచితంగా కళ్లజోళ్లు అందిస్తోందని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు పులపర్తి సంతోష్, కిరణ్మయి అన్నారు. సోమవారం గణపవరం పీహెచ్‌సీ పరిధిలోని వల్లూరు సచివాలయం వద్ద వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించారు. సుమారు 60 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించినట్టు కంటి వెలుగు అధికారి శ్రీనివాస్ అన్నారు. సర్పంచ్ ముచ్చర్ల వేణు, సీహెచ్‌వో జె.విల్సన్ పాల్గొన్నారు.

సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ



ఉంగుటూరు: కంసాలిగుంటలో సోమవారం సీతారాముల విగ్రహప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించారు.టీటీడీ దేవస్థానానికి చెందిన సమరసత సేవా ఫౌండేషన్ ఆర్థిక సాయంతో రామాలయం నిర్మించి విగ్రహాలను ప్రతిష్ఠించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ బాబ్జి, వైసీపీ నాయకుడు పుప్పాల చిన్నబాబు, మండల కన్వీనర్ మరడ మంగరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మరడ రమావతి, సచివాలయాల మండల కన్వీనర్ పెనుగొండ బాలకృష్ణ, సర్పంచులు తమ్మిన శ్రీనివాసరావు, మిద్దె సత్యవతి పాల్గొన్నారు.